
సాక్షి
బాపట్ల

సోమవారం। 13। జనవరి। 2025



పొనుగుపాడులో పోలీస్ పికెట్

ఫిరంగిపురం: పొనుగుపాడులో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు పికెట్ ఏర్పాటుచేశారు. చర్చి సమీపంలోని గోడను శనివారం పొక్లెయిన్‌తో కూల్చివేసిన విషయం విదితమే.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 564.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,800 క్యూసెక్కులు వదిలారు.

రాహు-కేతుపూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

న్యూస్‌రీల్

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ భగవద్గీతను దైనందిన కార్యక్రమాల్లో ఆచరించాలని ఆధ్యాత్మికవేత్త శ్రీ ధనేశ్వర దాస్‌గోస్వామి (యూఎస్ఏ) అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనేశ్వరదాస్ గోస్వామి మాట్లాడుతూ ప్రపంచానికి భగవద్గీత అవసరం ఉందని అన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం దాని ద్వారా లభిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద అందరికీ స్ఫూర్తి ప్రదాత అన్నారు. కార్యక్రమంలో మురారి దాస్ స్వామి, నిర్వికల్పానానంద స్వామి, బార్ అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ ఉపాధ్యక్షుడు జి.శాంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి వ్యవసాయ క్షేత్రంలో భోగి మంటలు



తెనాలిరూరల్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మండలంలోని పెదరావూరు గ్రామంలో మనోహర్‌కు గల వ్యవసాయ క్షేత్రంలో భోగి వేడుకలను ఆదివారం ప్రారంభించారు. మంత్రి భోగి మంటలను వెలిగించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఈ నెల 13వ తేదీన జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను భోగి పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

51,059 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు 70,324 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 51,059 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గత అక్టోబర్ మూడవ వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 854 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 771 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 19,130కుగాను 7,781, మొక్కజొన్న 20,386కుగాను 14,850, కంది 54కుగాను 149, పెసర 10,516కుగాను 5,177, మినుము 5,833కుగాను 5,406, మంచిశనగ 7,970కుగాను 6,289, పొగాకు 924కుగాను 3,369 హెక్టార్లలో సాగు చేశారు. మిరప 6,978, పండ్ల తోటలు 7, కూరగాయలు 157, ఉల్లి 69, ఇతర పంటలు 56 హెక్టార్లలో సాగు చేశారు.

గోదాదేవికి సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారంతో ఈ ఉత్సవాలు 28వ రోజుకు చేరుకున్నాయి. సుమారు 170 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. చిన్నజీయర్‌స్వామి వారికి మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డీజీ రామకృష్ణ పాల్గొని స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

పంటలకు గిట్టుబాటు ధర లేదు



వర్షాల కారణంగా ఉప్పు సాగు పూర్తిగా లేకుండా పోయింది. జనం దగ్గర డబ్బులు ఉంటేనే నా హోటల్‌కు నలుగురు వచ్చిపోయేది. నాకు బేరం సాగేది. ప్రస్తుతం హోటల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. గత ప్రభుత్వంలో నెల నెలా ఏదొక పథకం ద్వారా జనానికి డబ్బులు వచ్చేవి. మాలాంటోళ్లకు వ్యాపారాలు జరిగేవి. డబ్బులు ఉంటేనే కదా పండుగ. కష్టాల్లో పండుగ ఎలా చేసుకుంటాం ?

-కుంచాల సుధాకరరెడ్డి, హోటల్ యజమాని

పనులు లేవు



ఏదో నాకు తెలిసిన జేసీబీ వర్క్‌తో ధైర్యం చేసి, అప్పు తీసుకొని మరీ వాహనాన్ని కొనుక్కున్నా. ఆరు నెలలుగా పని లేదు. సరైన ఆదాయం లేక బ్యాంకు అప్పు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నా. గతంలో జనం వద్ద డబ్బుల రొటేషన్ ఉండేది. పనులు చేయించుకునే వారు. మాకు ఏదో ఒక పని దొరకడం వల్ల అప్పు తీర్చేందుకు అవకాశం కలిగేది. ఇప్పుడు కష్టాల్లో సంక్రాంతి పండుగను ఎలా చేసుకోగలం? పిల్లలకి బట్టలు కూడా కొనే పరిస్థితి లేకుండా ఉంది.

– అక్కల సుబ్బారెడ్డి, జేసీబీ యజమాని

పూట గడవటమే కష్టం



పండుగ చేసుకునేందుకు డబ్బులు లేక కొఠారులో కూలీ పని చేసుకుంటున్నాం. రోజంతా కష్టపడితే గానీ డబ్బులు రావు. ఇప్పటి దాకా కొఠారు పనులు జరగనే లేదు. దాంతో మా దగ్గర డబ్బులు లేకుండా పోయాయి. కొత్త బట్టలు తెచ్చుకుందామంటే డబ్బులు లేక పనికి వచ్చాం. జగన్ ప్రభుత్వం మాకు ఏదో రకంగా డబ్బులు ఇచ్చింది. పండుగ నిండుగా చేసుకునే వాళ్లం. ఇప్పుడు మాకు కూలీ డబ్బులతో పూటగడుపుకోవడమే కష్టంగా ఉంది.

– జొన్నల పావని, ఉప్పు కూలీ

తగ్గిపోయిన చికెన్ వ్యాపారం



నాది చికెన్ వ్యాపారం. గతంలో బాగా సాగింది. రోజుకు కనీసం 10 కోళ్ల తగ్గకుండా అమ్మేదానిని. ఇప్పుడు ఆదివారం మాత్రమే అమ్ముతున్నాను. గత ప్రభుత్వం ఏదో రకంగా డబ్బులు ఇచ్చేది. జనాలదగ్గర నిండుగా ఉండేవి. రోజూ వచ్చి చికెన్ కొనుక్కొని పోయే వారు. ఇప్పుడు డబ్బులులేవు.. కొనేవారు లేవు. పండుగెలా సంతోషంగా చేసుకుంటాం.

– వెంకటేశ్వరమ్మ, చికెన్ వ్యాపారి

సంక్షేమం రాదు.. సంక్రాంతి లేదు

చినగంజాం మండలంలో రాజు బంగారుపాలెం అనే గ్రామం ఉంది. అయితే, ఆ ఊరులో ఉన్నవారెవరూ రాజులుకాదు.. బతుకులు బంగారమూ కాదు. పంచాయతీ పరిధిలో మూడు వేల కుటుంబాలుండగా, సుమారు 10 వేల మంది జనాభా ఉన్నారు. గ్రామంలో రెడ్డి సామాజిక వర్గంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలు కూడా ఉన్నారు. అంతా రెక్కాడితేగానీ డొక్కాడని బడుగుజీవులు. నిత్యం కష్టాల సంద్రాన్ని ఈదే అల్పజీవులు. సంక్రాంతి పండుగనెలా జరుపుకుంటున్నారోపరిశీలించడానికి సాక్షి బృందం ఆదివారం గ్రామాన్ని సందర్శించింది. గ్రామస్తులతో మాట కలిపింది. ఆర్థిక ఇబ్బందులతో ఈ ఏడాది పండుగ ఘనంగా కాదుకదా ఒక మోస్తారుగా కూడా జరుపుకునే పరిస్థితి లేదని పలువురు ఆవేదన చెందారు.



రాజు బంగారుపాలెం గ్రామంలోని ప్రధాన వీధి

- ఆర్థిక ఇబ్బందులతో పండుగ జరుపుకోలేని స్థితిలో రాజు బంగారుపాలెం వాసులు
- ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు
- గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమపథకాలు రద్దు
- కూటమి సర్కార్ సాయం కరువు
- కూలీ డబ్బులు పొట్టకూటికి సరి
- పండక్కి కొత్త బట్టలు, సరుకులు కొనుక్కోలేని స్థితి

సాక్షి ప్రతినిధి,బాపట్ల/చినగంజాం: చినగంజాం మండలంలోని రాజు బంగారుపాలెం గ్రామంలో సంక్రాంతి సందడి కరువైంది. చేద్దామంటే పనుల్లేక, చేతిలో చిల్లి గవ్వలేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో అధికంగా సాగుచేస్తున్న ఉప్పు సాగు వర్షాలతో నిలిచి పోయింది. రైతులతోపాటు కూలీలకు పనులు లేకుండా పోయాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా దక్కడం లేదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బస్తా ధాన్యం ధర రూ.1900 అమ్మితే ఈ ఏడు రూ.1400కు కూడా కొనేవారు లేరు. దీంతో పెట్టుబడులు కూడా రాక రైతులు ఉసూరుమంటున్నారు. గ్రామస్తులను కదిపితే గుండె చెరువవుతోంది.

జనం జేబులో డబ్బుల్లేక చాలాకాలంగా సజావుగా నడుస్తున్న హోటల్ మూతపడే పరిస్థితికి చేరిందని ఓ వ్యాపారి వాపోయారు. గ్రామస్తులను నమ్ముకుని పెట్టిన చికెన్ దుకాణం మూతపడే పరిస్థితి వచ్చిందని మహిళా వ్యాపారి కన్నీటి పర్యంతరమైంది. చదువుకునే బిడ్డకు జగన్ సార్ అమ్మ ఒడి ఇస్తే.. ఈ ప్రభుత్వం పైసా ఇవ్వలేదని మరో యువతి ఆగ్రహం వ్యక్తం చేసింది. పింఛన్లు తీసేశారని కొందరు, రైతు భరోసా ఇవ్వలేదని కొందరు, మూడు గ్యాస్ సిలిండర్లకు కాకుండా ఒక్క సిలిండర్‌కే డబ్బులేశారని మరికొందరంటే.. అసలు ఒక్కదానికీ ఇవ్వలేదని ఇంకొందరు మండిపడ్డారు. జగన్ ఉండి ఉంటే డబ్బులిచ్చేవారిని, ఇప్పుడు అవి కూడా పోయాయని ఓ డ్రైవర్ బాధను వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలవారికీ డబ్బులొచ్చేవని, అవి అవసరమైనవాటికి ఉపయోగపడడమే కాకుండా పండుగలు సంతోషంగా జరుపుకునే వారమని గ్రామస్తులు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పథకం ద్వారా కూడా పేదలకు పైసా ఇచ్చిన పరిస్థితి లేదని, ఇలాంటి కష్టాల్లో పండుగ ఎలా జరుపుకోగలమని పలువురు ప్రశ్నించారు.

కదిలిస్తే కన్నీటి కథలు



గ్రామంలో ఒక చోట చేరి మాటామంతి చేస్తున్న మహిళలు

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



కూటమి నాయకులు చెప్పినదానికి... చేసే దానికి అసలు సంబంధమే లేదు. ఇంకెక్కడి సంక్రాంతి పండుగ జరుపుకుంటామండీ ? వారిచ్చిన సూపర్ సిక్స్‌లో పింఛను తప్పా ఏమి ఇస్తున్నారు. మిగతా వాటి మాటేమిటి? మా దివ్యాంగులు పింఛను విషయం కూడా తనిఖీలు చేస్తామంటున్నారు. మంచంలో ఉంటే మాత్రమే ఇంటికి తెచ్చిస్తామంటున్నారు. గతంలో మా ఊర్లో సంక్రాంతి పండుగ సందడి ఈ పాటికి కనబడేది. ఇప్పుడు ఆ హడావుడి అసలు చూద్దామన్న లేదు.

– కొణసం శ్రీనివాసరెడ్డి, దివ్యాంగ రైతు

పండుగ ఎలా చేసుకునేది?



వచ్చాడు అయ్యా..ఓ అయ్య. ఏందయ్యా పండుగ చేసుకునేది. అది అన్నాడు, ఇది అన్నాడు. ఏదీ లేదు. కూలీ పనులు లేవు. పొద్దున పోయి సాయంత్రానికి వస్తే రూ.300 ఇస్తున్నారు. అది కూడా ఆటో ఎక్కి దూరం ఊళ్లకు పోతేనే అదైనా. కొఠారు పనులకు వెల్దామంటే అవి కూడా సక్రమంగా సాగడం లేదు. ఇంకేంటయ్యా మేము సంపాదించి తినేది? తిండికే సాగక పోతుంటే ఇంకా పండుగ ఏ మాత్రం చేసుకోగలుగుతాం.. నువ్వే చెప్పయ్యా ! సరుకులు ధరలు పెంచేశారా? నూనె కేజీ రూ.160 అమ్ముతోంది. గత ప్రభుత్వంలో రూ. 100 అమ్మేవారు. మా పరిస్థితి ఇలా ఉంటే ఇంక పండుగ ఏమి చేసుకుంటామయ్యా ?

– అక్కల సుబ్బరావమ్మ, అమీన్ నగర్

కో'ఢీ' పందేలకు బరులు సిద్ధం



తూర్పుపాలెంలో ఏర్పాటు చేసిన వేదిక

- చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో 30 ఎకరాల్లో బరులు ఏర్పాటు
- టీడీపీ నాయకులే నిర్వాహకులు
- బరుల వైపు కన్ను ఎత్తైనా చూడని పోలీసులు
- జూదాలతో ఛిద్రమవుతున్న కుటుంబాలు



బరుల చుట్టూ ఫెన్సింగ్

రేపల్లె రూరల్: సంప్రదాయం పేరుతో కోడి పందేలకు రేపల్లె తీరం సిద్ధమైంది. టీడీపీ నాయకులే అక్రమార్జనకు తెర లేపారు. సంక్రాంతి సంబరాల పేరుతో రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం వద్ద 30 ఎకరాల్లో కోడి పందేలకు బరులు సిద్ధం చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రధాన అనుచరుడు, చెరుకుపల్లి మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడే నిర్వహణను దగ్గరుండి చూసుకుంటున్నాడు. తూర్పుపాలెంలో ఇప్పటికే 30 ఎకరాలను రైతుల నుంచి లీజుకు తీసుకుని, ఎకరానికి రూ.15వేల చొప్పున చెల్లించారు. బరుల కోసం ఎంపిక చేసిన ప్రాంతం చుట్టూ పెద్ద స్తంభాలను పాతి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. చిన్నా, పెద్ద పందేల కోసం ఎనిమిది బరులను సిద్ధం చేశారు. కోళ్ల పందేలతో పాటు పేకాట, గుంటాట, కాసినో, లాటరీ, బ్రాకెట్ ఆటలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో పాటు బరుల వద్ద బిర్యానీలు, అల్పాహారం వంటి పదార్థాలతో పాటు మద్యం విక్రయాలకు పెద్ద మొత్తంలో పలువురు వ్యాపారులకు అనుమతులు ఇవ్వడం విశేషం.

పార్కింగ్‌లకు సప'రేటు'

పందేలకు వచ్చే ప్రజలు వాహనాలను నిలుపుకోవడానికి అవసరమైన పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు లక్షల్లోనే బేరాలు కుదిరినట్లు పచ్చరంగు నాయకులే బాహాటంగా మాట్లాడుకుంటున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.50 నుంచి రూ.100, ఆటోలు, కార్లకు రూ.200 నుంచి రూ.250 వరకు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

న్యాయస్థానాల ఆదేశాలు బేఖాతర్

కోడి పందేలు నిర్వహించరాదంటూ న్యాయస్థానాలు పదేపదే ఆదేశాలు జారీ చేసినా సంబంధిత బరులవైపు సంబంధిత అధికారులు కన్నెత్తైనా చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తూర్పుపాలెంలో జూద నిర్వహణకు బరులు సిద్ధమయ్యాయని తెలిసినా పోలీసులు పట్టించుకోవడం లేదు. నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గటమేనని ఆరోపణలు వస్తున్నాయి. సంప్రదాయం పేరుతో నిర్వహిస్తున్న జూదాల వల్ల ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి. న్యాయ స్థానాల ఆదేశాలను పరిగణలోకి తీసుకుని సంబంధిత అధికారులు పందేలు జరగకుండా చర్యలు చేపట్టాలని తీరప్రాంత ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

ఖోఖోలో శివారెడ్డి జికేల్

- ప్రపంచకప్ ఖోఖో క్రీడలకు ఎంపికైన పంగులూరు క్రీడాకారుడు శివారెడ్డి
- అంతర్జాతీయ ఖోఖోలో రెండుసార్లు ఆడిన అనుభవం



మెడల్స్‌తో శివారెడ్డి

జే.పంగులూరు: అతనిది సాధారణ రైతు కుటుంబం. ఖోఖోలో నైపుణ్యం సాధించి ఇంతింతై వటుడింతై అన్నట్టు చివరకి అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తున్నాడు. ఈ పాటికే రెండుసార్లు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి బంగారు పతకం సాధించాడు. ప్రస్తుతం ఢిల్లీలో 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ కప్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు.

మూడో సారి అంతర్జాతీయస్థాయిలో..

మొట్ట మొదటిసారిగా ఖోఖో ప్రపంచ కప్‌లో శివారెడ్డి ఆడుతుండటంతో పంగులూరు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికి 2018లో జైపూర్, లండన్‌లో రెండు సార్లు అంతర్జాతీయ వేదికపై ఆడిన అనుభవం ఉంది. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో ఆదిలాబాద్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పంగులూరులో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ తీసుకున్న వారిలో ఆరుగురు క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించడం ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో చైర్మన్ బాచిన చెంచుగరటయ్య శివారెడ్డిని అభినందించాడు. రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ ఆర్కే ప్రసాద్, ఎమ్మెస్సార్ ట్రస్ట్ చైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ శీనయ్య, జిల్లా ఖోఖో చైర్మన్ మన్నెం మాధవీలత, శాసన సభ్యుడు ఉగ్రనరసింహరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు కుర్రా భాస్కరావు, కాశీవిశ్వనాథరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఎస్ఆర్ ఖోఖో అకాడమీ కోచ్‌లు, జిల్లా ఖోఖో అసోసియేషన్ ట్రెజరర్ హనుమంతరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివారెడ్డిని అభినందించారు.

ఎస్ఆర్ఆర్ అకాడమీలో శిక్షణ

పోతిరెడ్డి శివారెడ్డి పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. ఇంటర్ స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ఇంకొల్లులో డిగ్రీ, గుంటూరులో బీపీఈడీ పూర్తిచేశాడు. ఇతని స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు మండలం ఈదర గ్రామం. తండ్రి పోతిరెడ్డి గురవారెడ్డి, తల్లి కోటేశ్వరమ్మ. వీరిది చిన్నకారు రైతు కుటుంబం. తండ్రి ప్రోత్సాహం, భవనం కాశీవిశ్వనాథరెడ్డి, మేకల సీతారామిరెడ్డి శిక్షణలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. 12 ఏళ్ల పాటు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందాడు. అనేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించాడు. ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19 వ తేదీ వరకు జరిగే ఖోఖో ప్రపంచ కప్పు పోటీలకు దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ప్రపంచ కప్ లక్ష్యం



నాకు మొట్టమొదటి నుంచి కాశీవిశ్వనాథరెడ్డి, మా కోచ్ సీతారామిరెడ్డి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిచారు. నేను ఇంతటి వాడిని అవ్వడానికి మా తల్లిదండ్రులతో పాటు నాకు ఆటపై మక్కువ చూపెట్టిన మా కోచ్‌లకు రుణపడి ఉంటా. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించడానికి కృషి చేస్తా. ప్రపంచకప్ మనం దేశం సాధించేలా ఆడుతాను.

-పోతిరెడ్డి శివారెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు

చాలా ఆనందంగా ఉంది..



శివారెడ్డి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎంపిక అవుటం చాలా ఆనందంగా ఉంది. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ తీసుకున్న వారిలో ఇప్పటికి అంతర్జాతీయ స్థాయిలో ఆరుగురు ఆడారు. భవిష్యత్‌లో మరింత మందిని అందించేందుకు కృషి చేస్తాం.

– మేకల సీతారామిరెడ్డి, కోచ్

బాధ్యతతో పనిచేస్తే మంచి గుర్తింపు

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల: బాధ్యతతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తోందని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ 2025 క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్‌ను అందిపుచ్చుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఒక దళిత ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించి సమాజ సేవకు తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో పులి శేషగిరిరావు, మురికిపూడి దేవపాల్, రావెల నల్లయ్య, ప్రసాద్, దేగల అర్జున్, మొవ్వ శరత్‌చంద్ర, యడ్ల అనిల్, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్

చెన్నై జట్లు విజయం

ఉత్కంఠభరితంగా క్రికెట్ మ్యాచ్‌లు

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్స్‌అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ టీ-20 క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో చెన్నై జట్లు విజయం సాధించాయి. ఉదయం సౌత్ జోన్ సీసీ చెన్నై, లైన్స్ సీసీ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. బెంగళూరు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. చెన్నై జట్టు ఓపెనర్ నందకిశోర్ 45 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్ సాయంతో 65 పరుగులు చేశాడు. బెంగళూరు బౌలర్ మోసెస్ నాలుగు ఓవర్లలో 19 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. 143 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 141 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. దీంతో ఒక్క పరుగు తేడాతో చెన్నై జట్టు బెంగళూరు జట్టుపై గెలుపొందింది. మధ్యాహ్నం జీఎస్‌టీ అండ్ సీఈ లెవెన్ చెన్నై, వైట్‌ఫీల్డ్ సీఏ లెవెన్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వైట్ ఫీల్డ్ సీఏ లెవెన్ బెంగళూరు జట్టు 17.1 ఓవర్లలో 54 పరుగులకే ఆలౌటైంది. 55 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు కేవలం 9.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయ లక్ష్యాన్ని చేరుకుంది. 5 వికెట్ల తేడాతో బెంగళూరు జట్టుపై చెన్నై జట్టు విజయం సాధించింది..



రావినూతల క్రికెట్ స్టేడియంలో ఫెవిలియన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలన

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రావినూతల క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఫెవిలియన్‌ను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పల్లె ప్రాంతంలో ఇలాంటి క్రీడామైదానం ఉండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో పోటీలు ఈ ప్రాంగణంలో జరగాలని ఆయన ఆకాంక్షించారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం మ్యాచ్ ఇండియన్ బ్యాంక్ ఎస్ అండ్ ఆర్‌సీ చెన్నై – సౌత్ జోన్ సీసీ చెన్నై, మధ్యాహ్నం ఎస్‌కేఎం సీసీ లెవెన్ చెన్నై , జీఎస్‌టీ లెవెన్ చెన్నై జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

క్లుప్తంగా

హోరాహోరీగా జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు



పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో 37వ జాతీయస్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో మూడో రోజు న్యూ కేటగిరీ విభాగంలో పోటీలు నిర్వహించారు. 14 క్వింటాళ్ల బండను 15 నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం లాగిన జతను విజేతగా ప్రకటిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీలో 9 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. కడపటి సమాచారం అందే సమయానికి గుంటూరు జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన ఆర్‌కే బుల్స్ ఎడ్ల జత 15 నిమిషాల వ్యవధిలో 14 క్వింటాళ్ల బండను 5,169 అడుగుల దూరం లాగి ముందంజలో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కోడి పందేల బరులను దున్నించిన పోలీసులు



కొల్లూరు : సంక్రాంతి సంబరాల పేరుతో పెద్దఎత్తున కోడి పందేల నిర్వహణకు అధికార కూటమి నాయకులు చేస్తున్న ఏర్పాట్లను పోలీసులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాలతో కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు మండలంలోని అనంతవరం, కొల్లూరు శివారు బోసు నగర్ వద్ద ఏర్పాటు చేసిన బరుల్లో పనులను నిలిపివేయించారు. ఇప్పటికే సిద్ధమైన వాటిని ట్రాక్టర్లతో దున్నించి, టెంట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కోడి పందేలు, ఇతర జూదాలు జరగకుండా మండలంలో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా ఎవ్వరూ పందేల నిర్వహణ చేపట్టరాదని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా నిర్వహిస్తుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఢీ అంటే ఢీ
రసవత్తరంగా పొట్టేళ్ల పోటీలు



పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో ఆదివారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది రైతులు, క్రీడాభిమానులు వచ్చారు. గత 37 సంవత్సరాల నుంచి ఎడ్ల పోటీలతో పాటు సంప్రదాయ క్రీడలు కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు అంతరించి పోకుండా ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

ఆగిన అంగవైకల్య పత్రం

- వైకల్య ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీ నిలిపివేత
- ఏప్రిల్ వరకూ ఇవ్వరాదని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు
- పింఛన్ల తొలగింపు దిశగా అడుగులు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మరీ వేటు వేసేందుకు యోచన

చీరాల: దివ్యాంగుల సామాజిక భద్రత పింఛన్ల పెద్దఎత్తున తొలగించేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. పింఛన్ల ఎత్తివేతపై భిన్న స్వరాలు వినిపిస్తోంది. వైకల్య ధ్రువపత్రాలు బోగస్‌వని చూపి అందుతున్న పింఛన్లను రద్దు చేసేందుకు కుటిల యత్నాలు సాగిస్తోంది కూటమి ప్రభుత్వం. ఇందులో భాగంగానే వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను కొద్ది నెలలు నిలిపివేయాలని నిర్ణయించింది. దివ్యాంగుల్లో వైకల్యశాతాన్ని ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు నిర్వహించే సదరం శిబిరాలను ఈనెల నుంచి ఏప్రిల్ వరకు ఏర్పాటు చేయరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తిరిగి తాము ఆదేశాలు ఇచ్చేంత వరకు ఈ ప్రక్రియ నిలిపివేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించింది. సదరం శిబిరాలను నిలిపివేసిన నేపథ్యంలో ఇతర పథకాలకు, అవసరాలకు వైకల్య ధ్రువీకరణపత్రాలు సమర్పించాలంటే తమ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.



భారాన్ని తగ్గించుకునేందుకేనా?

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి ప్రభుత్వం పథకాలను తగ్గించి వేస్తోంది. కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లను భారంగా భావిస్తోంది. ఈ క్రమంలోనే అనర్హుల గుర్తింపు పేరుతో ఉన్న పింఛన్లను ఏరివేతకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీకి శ్రీకారం చుట్టింది. ప్రతి 50 పింఛన్లకు ఒకటి చొప్పున 12 బృందాలు సచివాలయ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద ప్రభుత్వం 17 కేటగిరిల లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తోంది. ప్రధానంగా కిడ్నీ రోగులకు ప్రతి నెలా రూ.10 వేల చొప్పున అందిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది అనర్హులున్నారని ప్రభుత్వం భావిస్తుంది. జిల్లా వ్యాప్తంగా అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఏప్రిల్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు.

అందనంత దూరాన సదరం

జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం ప్రభుత్వ వైద్యశాలలో సదరం శిబిరాలు జరుగుతాయి. ఒక్కో శిబిరంలో ఎక్కువ మంది వైకల్య ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించేందుకు చీరాల ఏరియా వైద్యశాలకు వస్తుంటారు. పింఛన్ల వెరిఫికేషన్ చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 1 నుంచి సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సర్టిఫికెట్లలో సవరణలు, తొలగింపులు వంటివి కూడా నిలిపివేశారు. నాలుగు నెలలు బ్రేక్ పడడంతో శిబిరాలు నిలిపోతాయి. అనర్హుల పేరుతో అర్హులైన వారి పొట్టకొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

బాపట్ల జిల్లాలోని 25 మండలాలతో పాటు బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి మున్సిపాలిటీలు ఉన్నాయి. దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో ఉన్న వారు 26,265 మంది ఉన్నారు. వీరిలో పూర్తిగా ఆరోగ్య సమస్యలతో ఉన్న వారు 1582 మంది రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అందుకుంటున్నారు. దివ్యాంగుల కోటా నుంచి 24,683 మంది నెలకు రూ.6 వేలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం రూ.95 కోట్ల మేరకు ప్రభుత్వం దివ్యాంగులకు, ఆరోగ్య సమస్యలతో ఉన్నవారికి పింఛన్లు అందజేస్తోంది.

మిత్రమా.. కుశలమా !



1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

వేటపాలెం: ''ఒరే రమేష్.. ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి ! బాగా లావెక్కావు.. ఎంత మంది పిల్లలు, ఏం చదువుతున్నారు? అరే.. వెంకట్రావు .. నాకు ఇద్దరు పిల్లలు, ఇంటర్ చదువుతున్నారు.. నేను బాగానే ఉన్నాను...మరి నువ్వో '' అంటూ కుశల ప్రశ్నలు, ఆలింగనాలతో బండ్ల బాపయ్య హిందూ హైస్కూల్ ప్రాంతమంతా భావోద్వేగంతో నిండింది. ఆదివారం స్థానిక బండ్ల బాపయ్య హిందూ హైస్కూల్‌లో 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 120 మంది సంక్రాంతి సందర్భంగా స్కూల్ ఆవరణలో అపురూప సమ్మేళనంతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముంగర రాంబాబు, ప్రదీప్, కిశోర్, బలరాం, మల్లేష్, మల్లికార్జున, ఉపాధ్యాయులు బట్టా మోహన్‌రావు, సజ్జా చంద్రమౌళి, ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, దాసు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్



ఆడుతున్న క్రీడాకారులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ప్రీమియర్ లీగ్, సీజన్-3 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో వీటిని నిర్వహిస్తున్నారు. తొలుత చిన్ని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 23వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందని, అదే రోజు నగదు బహుమతి , కప్పు అందిస్తామని తెలిపారు. అన్ని జిల్లాల టీమ్‌లు వచ్చాయని అన్నారు. అసోసియేషన్ తరపున యువ క్రీడాకారులకు గ్రౌండ్లు, అకాడమీలు త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం అకాడమీ సిద్ధమైందన్నారు. మంగళగిరిలోని స్టేడియం అభివృద్ధితో పాటు అమరావతిలో నూతన స్టేడియం నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని రూ. 50 కోట్లతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

హైటెక్ హరిదాసు

కొల్లూరు : సంప్రదాయాలకు పెద్దపీట వేసే సంక్రాంతి పండుగ అంటేనే వేకువజామున హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు ఠక్కున గుర్తుకు వస్తాయి. అయితే, ఓ హరిదాసు హైటెక్ పద్ధతిలో ద్విచక్ర వాహనంతో ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేపట్టడం ఆశ్చర్యకరంగా మారింది. కొల్లూరు మండలంలోని పెసర్లంకలో హరిదాసు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ, ఒక చేతితో చెక్క భజన చేస్తూ, మరో చేత్తో వాహనాన్ని నడుపుతూ భిక్షాటన చేయడాన్ని గ్రామస్తులు విడ్డూరంగా చూశారు. తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన మున్నంగి తిరుపతయ్య నాలుగు లంక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేయడానికి సమయం సరిపోక పోవడంతో ద్విచక్ర వాహనాన్ని వాడుతున్నాడు.



ద్విచక్రవాహనంపై ఇంటింటికీ తిరుగుతున్న హరిదాసు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మేడికొండూరు: బైకును గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్‌లోని చంద్రయ్య పెట్రోల్ బంకు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన భాగ్య రమేష్ (30) గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వస్తున్నాడు. మార్గంమధ్యలో చంద్రయ్య పెట్రోలు బంకు వద్దగుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మేడికొండూరు పోలీసులు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: జూద క్రీడలు వద్దు .. సంప్రదాయ క్రీడలే ముద్దు అని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన వెటరన్ క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుంచి పలువురు వారి సొంత ప్రాంతాలకు వస్తుంటారన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా కుటుంబ సభ్యులు స్నేహితులతో ఆహ్లాదకరంగా పండుగను జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగకు గాలిపటాలు ఎగురవేయటం, రంగవల్లులు, కబడ్డీ పోటీలు, క్రికెట్ వంటి సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించుకోవాలన్నారు. సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ రోజు ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎవరైనా కోడిపందేలు, పేకాట, ఇతర జూద క్రీడలలో పాల్గొన్న, నిర్వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటువంటి వారి మీద చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంబంధిత పోలీస్ అధికారులకు లేదా 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని ప్రజల్ని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో అండర్ 14 క్రికెట్ జట్టులో ఎన్నికైన అబ్దుల్ సాద్ ఉనాయిస్‌కు క్రికెట్ బ్యాట్ బహూకరించి అభినందించారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో సత్తా చాటి జాతీయస్థాయిలో బాపట్ల జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ డి.రామ్మోహన్, ప్రెసిడెంట్ కె. రఘునాథ్, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్, గంటా అంజిబాబు, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడికి బ్యాట్‌ను బహుకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

31 నుంచి బాల మహోత్సవ్-2కే25

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ''విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25'' పేరిట పోస్టర్లను చైర్మన్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. చిన్నారులు ప్రతిభ చాటేందుకు ఈ మహోత్సవ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. జూనియర్స్ (5 - 7), సీనియర్స్ (8 - 10వ తరగతి వరకు) విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లు నిర్వహించనున్నట్లు వివరించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పరుగు పందేలు, మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వీసీ నాగభూషణ్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆప్త' ఆధ్వర్యంలో స్కాలర్ షిప్‌లు పంపిణీ



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న ఆప్త నాయకులు

బాపట్ల: అమెరికన్ ప్రోగ్రెస్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలోని వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు. ఆదివారం కాపు కల్యాణ మండపంలో 430 విద్యార్థులకు రూ.80 లక్షల రూపాయలు చెక్కులను అందజేశారు. ముఖ్య అతిథులుగా తులసి రామచంద్ర ప్రభు, లక్ష్మీనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. సభా అధ్యక్షులుగా జె.జె.వి. సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. తాండ్ర సుబ్బారావు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ చైనా వంటి దేశాల కంటే ముందుకు సాగాలని, అది విద్యార్థుల వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. డబ్బులు లేక ఎవరు విద్యను, జ్ఞానాన్ని వృథా చేయకూడదని చెప్పారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినాన్ని యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం ఆశయాలతో ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రమశిక్షణతో పెంచాలని చెప్పారు. టెక్నాలజీ వల్ల జరుగుతున్న అనర్థాలను గుర్తించి జాగ్రత్త పడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అన్నం సతీష్ ప్రభాకర్, గంట అంజిబాబు, అంబటి మురళి, ఉగ్గిరాల సీతా రామయ్య, అరవ రామకృష్ణ, డాక్టర్ ఉదయ్ భాస్కర్, వల్లభనేని శ్రీనివాస్, ఆప్త టీం సభ్యులు, పొందర్ శ్రీనివాస్, ముద్రగడ త్రినాథ్, శ్రీనాథ్, నాప కొనసాని, రాజేష్, ఆదిగోపాలం, రమణ, శ్రీకాంత్, కాపు సంఘ అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, శేషాద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.